## మిషన్ భగీరథ నీరు వృథా



వృథాగా మిషన్‌భగీరథ నీరు

చేగుంట, జూలై 11: గ్రామాల్లో మిషన్ భగీరథ తాగు నీరు రాక ప్రజలు ఇబ్బంది పడుతుంటే బోనాల్ గ్రామంలో నీరంతా వృథా అవుతున్నా పట్టించుకునే నాథుడు లేడు. గత ప్రభుత్వంలో ఇంటింటికీ మిషన్ భగీరథ నీళ్లు రెండు పూటలా వచ్చేది. కాంగ్రెస్ ప్రభుత్వం సాయంత్రం వచ్చే నీటి సరఫరాను నిలిపేసింది. మిషన్ భగీరథ నీరు వృథాగా పోతున్నా ఆ శాఖ వారు స్పందించడం లేదని, పైపులైన్లకు మరమ్మతులు కూడా చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు.

## శరత్‌చంద్రకు కామారెడ్డి ఎమ్మెల్యే అభినందన



వృథాగా మిషన్‌భగీరథ నీరు

రామాయంపేట, జూలై 11: జాతీయ స్థాయిఅండర్ 14 బాలుర ఫుట్‌బాల్ పోటీల్లో రాణించిన రామాయంపేటకు చెందిన కైరంకొండ శరత్‌చంద్రను కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట్రాంరెడ్డి హైదరాబాద్‌లోని తన స్వగృహంలో గురువారం అభినందించారు. శరత్‌చంద్రను జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. బాలుడితో ఫుట్‌బాల్ రామాయంపేట కోచ్ బొంతల సత్యనారాయణ ఉన్నాడు.

## ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉండాలి

**- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు**



పోస్టాఫీస్ రోడ్డు మార్గాన్ని పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్ మున్సిపాలిటీ, జూలై 11: కోదండ రామాలయం వెనుక గల పోస్టాఫీస్ క్వార్టర్స్ దారి ప్రజలకు అసౌకర్యం కలగకుండా యధావిధిగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ జానకీరామ్ సాగర్‌కు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. గురువారం పట్టణంలోని 8, 9వ వార్డులను కలిపే రోడ్డు మార్గాన్ని పోస్టాఫీస్ అధికారులు మూసివేయంతో ఆయా వార్డుల కౌన్సిలర్లు కల్యాణి, జయశ్రీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అదనపు కలెక్టర్, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, పోస్టల్ డిపార్ట్‌మెంట్ అధికారులతో కలిసి పరిశీలిచారు. అనంతరం ఐసీడీఎస్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. సిబ్బంది విధులకు హాజరు కాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. విధినిర్వహణలో ఆలసత్వం వహిస్తే సహించేది లేదని, హాజరు కాని వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలసదనం సందర్శించి, విద్యార్థులకు అందుతున్న మెనూ పరిశీలించారు.

## సర్కారు దవాఖానను సందర్శించిన క్రికెట్ ప్లేయర్



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న రంజీ క్రికెట్ ప్లేయర్ నాగేంద్ర

శివ్వంపేట, జూలై 11: శివ్వంపేట ప్రభుత్వ దవాఖానను హైదరాబాద్‌కు చెందిన రంజీ క్రికెట్ ప్లేయర్ నాగేంద్ర గురువారం సందర్శించారు. ప్రజలకు అందుతున్న వైద్యం, మందులపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైద్య సిబ్బంది ప్రియాంక, స్టాఫ్ నర్స్ స్రవంతి, ఆర్ఐలు కిషన్, సునీల్ తదితరులు ఉన్నారు.

## ఆలయ దారి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

**ఆలయ రహదారులు కబ్జా చేస్తున్నారని బిజిలీపూర్ గ్రామస్తుల ఆందోళన**

శివ్వంపేట, జూలై 11: మండలంలోని బిజిలీపూర్ గ్రామంలో గల పురాతన ఆలయాల దారులను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. గురువారం తహసీల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేసి, అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్ షఫీయొద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలోని దుర్గమ్మ, లింగమయ్య, పోచమ్మ ఆలయాలకు ఉన్న దారులకు ఆనుకుని ఉన్న పట్టాదారులు 50 ఏండ్ల కింద దారులు వదిలిపెట్టారన్నారు. ఇటీవల కొందరు రియల్ వ్యాపారులు సద్ది మాధవరెడ్డి, షేక్ ఖాజా పాషా, షేక్ చాంద్, షేక్ జహంగీర్ ఆలయాల చుట్టూ ఉన్న భూములు కొన్నారని, ఆలయాల దారులను కబ్జా చేశారన్నారు. ఇదేంటని అడిగితే భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లోనూ రియల్ వ్యాపారుల వద్ద గన్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో షామీర్‌పేట ఆంజనేయులు, చిట్యాల పోచయ్య, తుమ్మల జయరాజు, కమ్మరి బ్రహ్మాచారి, గొల్ల కృష్ణ, గొల్ల ఆంజనేయులు, నీరుడి వీరయ్య, మహ్మద్ యూసూఫ్, కుక్కల ముత్యాలు, మంగలి రవి, చిట్యాల సత్యనారాయణ, జింక ఆంజనేయులు, జింక వెంకటేశం ఉన్నారు.

## మద్యం దుకాణం వద్దని మహిళల ఆందోళన




గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

చిన్నశంకరంపేట, జూలై 11: తమ గ్రామంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని గ్రామ మహిళలు పంచాయతీ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళనకు దిగారు. మడూరు గ్రామంలో మద్యం దుకాణం ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లుచేశారు. దీంతో ఆ మహిళలు పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. దేవాలయాల పక్కన మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయడం సరికాదన్నారు. ఈ విషయంలో కలెక్టర్, ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

## అంత్యోదయ కార్డులివ్వాలని దివ్యాంగుల వినతి

నిజాంపేట, జూలై 11: కుటుంబ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా తమకు అంత్యోదయ రేషన్ కార్డులు, డబుల్ బెడ్‌రూం ఇండ్లను కేటాయించాలని మండలంలోని కల్వకుంట గ్రామానికి చెందిన దివ్యాంగులు తహసీల్దార్ సురేశ్‌కుమార్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దివ్యాంగులు బోనాల రాజు, మైసయ్య, సత్యనారాయణగౌడ్, పోశెట్టి ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దివ్యాంగులు

## అక్షయపాత్ర నిలిపేస్తాం

### వంట చేసేవారు ముందుకొస్తే

- మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎంఈవో
- పద్ధతి మార్చుకోవాలని వారం గడువు
- అక్షయపాత్ర ఉన్న పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో బుచ్చానాయక్



ఇంటి నుంచి ఎంతమంది భోజనం తెచ్చుకుంటున్నారని ఎంఈవో అడగగా చేతులెత్తిన పదో తరగతి విద్యార్థులు



అక్షయపాత్ర ఉన్న పాఠశాల హెచ్‌ఎంలతో ఎంఈవో

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

నర్సాపూర్, జూలై 11: నమస్తే తెలంగాణ దినపత్రికలో గురువారం ప్రచురితమైన బడి భోజనం వద్దు.. ఇంటిదే ముద్దు అనే కథనానికి అధికార యంత్రాంగం కదిలివచ్చింది. నర్సాపూర్ మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో ఉన్న జడ్పీహెచ్‌ఎస్‌లో మధ్యాహ్న భోజనం సరిగ్గా లేదని 90 శాతం విద్యార్థులు ఇంటి నుంచి టిఫిన్ బాక్సు తెచ్చుకుంటున్నారు. ఈ కథనంపై స్పందించిన ఎంఈవో బుచ్చానాయక్ అక్షయపాత్ర సిబ్బందితో కలిసి పాఠశాలను సందర్శించి, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. అన్నం మెత్తగా, పలుకుగా వస్తున్నదని విద్యార్థులు చెప్పారు. మండలంలోని ఆయా పాఠశాలల్లో అక్షయపాత్ర భోజనం ఎలా ఉందని హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సమావేశం ఏర్పాటు చేసుకుని వంట వారిని నియమించుకోవాలని సూచించారు.

**వండడానికి ముందుకొస్తే ప్రాధాన్యత ఇస్తాం: ఎంఈవో బుచ్చానాయక్**

గ్రామంలో మధ్యాహ్న భోజనం వండడానికి ఎవరైనా ముందుకొస్తే ప్రాధాన్యత ఇస్తామని ఎంఈవో తెలిపారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించామని, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులతో అభిప్రాయం మేరకు అక్షయపాత్ర ఉండాలా, లేదా నిర్ణయించుకోవాలని తెలిపారు. వారు నాణ్యమైన భోజనం అందిస్తామంటే వారం రోజులు గడువు ఇచ్చినట్లు పేర్కొన్నారు. భోజనం బాగుండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**అక్షయపాత్రను క్యాన్సల్ చేస్తాం: డీఈవో**

నమస్తే తెలంగాణలో వచ్చిన కథనానికి డీఈవో రాధాకిషన్ ఫోన్ చేసి మాట్లాడారు. గ్రామంలో మధ్యాహ్న భోజనం వండే వారుంటే అక్షయపాత్ర వారిని క్యాన్సల్ చేస్తామన్నారు. వండే వారు లేక అక్షయపాత్రకు అప్పగించినట్లు తెలిపారు. దీనిపై అక్షయపాత్రకు నోటీసులు ఇచ్చామని తెలిపారు. అప్పటివరకు నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు కృషి చేస్తామన్నారు.

## అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలి

- ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి
- కలెక్టర్ రాహుల్ రాజ్
- ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన కలెక్టర్




స్ట్రాంగ్ రూం వద్ద రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్



కార్యాలయంలో నోటీసు బోర్డును పరిశీలిస్తున్న కలెక్టర్

మెదక్, (నమస్తే తెలంగాణ)/ మెదక్ మున్సిపాలిటీ, జూలై 11: జడ్పీ ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్, జడ్పీ ప్రత్యేక అధికారి రాహుల్‌రాజ్ సూచించారు. గురువారం జడ్పీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అధికారులు, సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. కార్యాలయం నిర్వహణ, సిబ్బంది హాజరు రిజిస్టర్లు, నోటీసు బోర్డుపై గల నోటీసులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు. జడ్పీ పాలకవర్గం పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో వివిధ పనులు, సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

**మెదక్ స్టేడియంలోని స్ట్రాంగ్ రూంల పరిశీలన**

క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కలెక్టర్ రాహుల్‌రాజ్ మెదక్ స్టేడియంలోని ఈవీఎం స్ట్రాంగ్ రూంలను గురువారం పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్ రిజిస్టర్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేస్తూ సీసీటీవీల పర్యవేక్షణ, సెక్యూరిటీ పకడ్బందీగా నిర్వహించాలని మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాలకు సంబంధించి కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్స్ భద్రపరిచారని తెలిపారు. కలెక్టర్‌తో మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ కె.శ్రీనివాస్, ఆర్ఐ లక్ష్మణ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

**కొల్చారంలో..**

కొల్చారం, జూలై 11: రైతులను ఆయిల్ పామ్ పంటల వైపు ప్రోత్సహిస్తూ సాగు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. కొల్చారం రైతు వేదికలో వ్యవసాయ, ఉద్యాన వన అధికారులకు ఉద్యాన వన పంటల సాగుపై గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కువ గిరాకీ ఉన్న సేవలను రైతులకు అందించాలన్నారు. ఆయిల్ పామ్ పంటలపై వచ్చే లాభాలను రైతులకు తెలియజేయాలన్నారు. వ్యవసాయ విస్తరణాధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ ఫీల్డ్ విజిట్ చేయాలన్నారు. ప్రతీ మండలంలో 100 ఎకరాల్లో ఆయిల్ పామ్ పంట సాగుచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆయిల్ పామ్ టెక్నీషియన్ రంగనాయకులు, డీఏవో గోవింద్, జిల్లా హార్టికల్చర్ అధికారి నర్సయ్య, ఏడీఏలు వసంతసుగుణ, సంధ్య, పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

## 300 మందికి బీఆర్ఎస్ బీమా చెక్కులు అందజేత

**బీఆర్ఎస్ నాయకుడు దేవేందర్‌రెడ్డి**



బాధితులకు బీమా చెక్కును అందిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దేవేందర్‌రెడ్డి

చిన్నశంకరంపేట, జూలై 11: జిల్లా వ్యాప్తం గా వివిధ ప్రమాదాల్లో మృతి చెందిన 300 మంది బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున పార్టీ బీమా చెక్కులు అందజేసినట్లు పార్టీ రాష్ట్ర నాయకుడు దేవేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త నర్సింలు మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని గురువారం దేవేందర్‌రెడ్డి పరామర్శించారు. చందాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త వెంకటమ్మ రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాజు, రైతుబంధు మండల మాజీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్‌లు లక్ష్మణ్ రమాదేవి, నాయకులు శ్రీనివాస్, స్వామి, రమేశ్, ప్రసాద్‌రాజు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## సర్వర్ డౌన్..ఆగిన రిజిస్ట్రేషన్లు



సర్వర్ లేక బోసిపోయిన ఆఫీస్, వేచి చూస్తున్న రైతులు, వ్యాపారులు

- ఉదయం నుంచి రిజిస్ట్రేషన్ల కోసం పడిగాపులు
- వెనుదిరిగిన రైతులు, వ్యాపారులు

రామాయంపేట, జూలై 11: రామాయంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సర్వర్ డౌన్ కారణంగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. గురువారం ఉదయం నుంచి సర్వర్ రాకపోవడంతో రైతులు, వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. కార్యాలయ ఉద్యోగులు సైతం సర్వర్ రాకపోవడం పనిచేయక ఖాళీగా కూర్చున్నారు. ఈ రోజు ఒక్కటి కూడా రిజిస్ట్రేషన్ కాలేదని తెలిపారు. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు అధికారులపై మండిపడ్డారు. స్లాట్ బుక్ చేసుకుని హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి రామాయంపేటకు చేరుకున్నా పని కాలేదంటూ వెళ్లిపోయారు.

## ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం




మెదక్ మున్సిపాలిటీలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్

మెదక్ మున్సిపాలిటీ, జూలై 11: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ తిరుమల్‌రెడ్డి, అధ్యాపకులు గణపతి, సుధాకర్, శరత్‌రెడ్డి, దినాకర్, వామనమూర్తి, శేఖర్, మురళి పాల్గొన్నారు.

**పెద్దశంకరంపేటలో..**

పెద్దశంకరంపేట, జూలై 11: పెద్దశంకరంపేట పీహెచ్‌సీ సిబ్బంది, వైద్యాధికారి వికాస్ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. సిబ్బంది యాదయ్య, శ్రీదేవి, భూమయ్య, వెంకటేశం, సాయిలు, పోలు, ఏఎన్‌ఎంలు కమల, రమాదేవి, సంతోషి పాల్గొన్నారు.

**ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలి**

మెదక్ అర్బన్, జూలై 11: ప్రతి కుటుంబం ఆరోగ్యకరమైన జీవితం గడపాలని జిల్లా వైద్యాధికారి శ్రీరాం అన్నారు. గురువారం ప్రపంచ జనభా దినోత్సవాన్ని మెదక్ మతాశిశు సంరక్షణ కేంద్రంలో నిర్వహించారు.




పెద్దశంకరంపేట: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

## హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు



ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పదార్థాలను తనిఖీలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది



హోటల్ యజమానికి జరిమానా విధిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్

- నిల్వ ఉన్న 70 కిలోల మాంసం స్వాధీనం
- రూ.21 వేల జరిమానా

మెదక్ మున్సిపాలిటీ, జూలై 11: మెదక్‌లోని పలు హోటళ్లు, రెస్టారెంట్లపై మున్సిపల్ అధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. పలు హోటళ్లు, రెస్టారెంట్లలో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలతో పాటు 70 కిలోల మాంసాన్ని (చికెన్, మటన్) స్వాధీనం చేసుకుని డంపింగ్ యార్డులో పారబోశారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్ మాట్లాడుతూ పట్టణంలోని హోటళ్లు, రెస్టారెంట్‌లతో పాటు మిఠాయి బండార్లు, టీ స్టాళ్లు తనిఖీ చేశామన్నారు. పలు హోటళ్ల ఫ్రిడ్జిల్లో నిల్వ ఉంచిన, కుళ్లిపోయిన ఆహార పదార్థాలు, కూరగాయలు స్వాధీనం చేసుకున్నామన్నారు. రాయల్ మండీ రెస్టారెంట్‌కు రూ.10 వేలు, అరేబియాన్ మండీ రెస్టారెంట్‌కు రూ.5 వేలు, అల్వాహిద్ రెస్టారెంట్‌కు రూ.3 వేలు, టీ20 ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ రూ.2 వేలు, బాలాజీ మిఠాయి బండార్‌కు రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. తనిఖీల్లో మున్సిపల్ సిబ్బంది శ్రీనివాస్, సంజీవ్, కృష్ణ, కిరణ్, శ్యామ్, లక్ష్మణ్, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

## కోర్టు విధులు బహిష్కరించిన న్యాయవాదులు



మెదక్ కోర్టు విధులు బహిష్కరించిన న్యాయవాదులు

మెదక్ అర్బన్/నర్సాపూర్, జూలై11: న్యాయవాదిపై సిద్దిపేట ఏఎస్సై దాడికి నిరసనగా మెదక్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుభాష్‌చంద్రగౌడ్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించారు. న్యాయవాదిపై దాడి చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆకుల శ్రీను, ప్రధాన కార్యదర్శి శ్రీపతిరావు, కోశాధికారి దుర్గారెడ్డి, న్యాయవాదులు పోచయ్య, చంద్రరెడ్డి, శోభన్‌గౌడ్, శ్రీనివాస్ గౌడ్, రవిగౌడ్, కిరణ్‌రాజ్ పాల్గొన్నారు. న్యాయవాదిపై చేసిన దాడిని ఖండిస్తూ నర్సాపూర్‌లోని కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, న్యాయవాదులు జి.శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, సుధాకర్, నాగరాజు, స్వరూపరాణి, ప్రకాశ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై నిర్లక్ష్యం వహించొద్దు

**ఎలుకలు, శునకాలు రాకుండా తగిన చర్యలు చేపట్టాలి**

**రాష్ట్ర గురుకులాల రీజనల్ కో ఆర్డినేటర్ భీమయ్య**

రామాయంపేట, జూలై 11: విద్యార్థులపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర గురుకులాల రీజనల్ కో ఆర్డినేటర్ భీమయ్య అన్నారు. గురువారం రామాయంపేటలోని గురుకుల విద్యాలయాన్ని సందర్శించి, పరిసరాలను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై పలు సూచనలు సలహాలిచ్చారు. గురుకులంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రిన్సిపాల్, టీచర్లపైనే ఉంటుందన్నారు. విద్యార్థులపై కొన్ని రోజులుగా ఎలుకలు, శునకాలు దాడి చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వాటిపై తక్షణమే స్పందించాలన్నారు. విద్యార్థులపై ఎలుకలు దాడి చేయడం సహించరాని విషయమన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. ప్రస్తుతం గురుకులంలో ఎక్కడా ఎలుకలు రావడానికి వీల్లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. శునకాలపై మున్సిపల్ అధికారులకు ఫిర్యా దు చేయాలని, గేటు వద్ద వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆయన వెంట గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సరళాదేవి ఇతర సిబ్బంది ఉన్నారు

### తాగునీటిలో కాలుష్యంలేదు



నీళ్లు నింపుతున్న సిబ్బంది(ఫైల్)

రామాయంపేట, జూలై 11: సుతారిపల్లి గ్రామంలోని బోరుబావులకు చెందిన వాటర్‌లో ఎలాంటి కెమికల్ లేదని గ్రామ కార్యదర్శి పద్మ తెలిపారు. వారం క్రితం గ్రామంలోని తాగునీటిని బాటిళ్లలో హైదరాబాద్ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పరీక్షల కోసం తరలించామని పేర్కొన్నారు. సుతారిపల్లి వాటర్ కలుషితం కాదని ఫోరెన్సిక్ నిపుణులు పరీక్షలు చేసి తేల్చారన్నారు. నీటి విషయంలో గ్రామస్తులు ఆందోళన చెందవద్దన్నారు.

### ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, జూలై 11: జిల్లాలోని ఆయా మండలాల్లో గల ఐఈఆర్‌సీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ పోస్టులకు తాత్కాలిక పద్ధతిలో నియమాలకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో రాధాకిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 15న ఉదయం 10 గంటలకు జిల్లా సమగ్రశిక్షా అభియాన్ విద్యాశాఖ కార్యాలయంలో తమ బయోడేటాతో బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోతెరపీ, టీఎస్ పారా మెడికల్ బోర్డు రిజిస్ట్రేషన్, ఎమ్మెస్సీ (ఏఎస్ఎల్‌పీ)/బీఎస్సీ(ఏఎస్ఎల్‌పీ), డిప్లమా ఇన్ హియరింగ్ లాంగ్వేజీ స్పీచ్ సర్టిఫికెట్లు అందజేయాలన్నారు. వివరాలకు 7893308762, 9492039644 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

### ఎల్ వోసీతో ఆర్థిక భరోసా

శివ్వంపేట, జూలై 11: ప్రభుత్వం అందజేసే ఎల్‌వోసీతో ఆర్థిక భరోసా కలుగుతుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని శభాష్‌పల్లికి చెందిన అయ్యగారి సునీతకు గుండె ఆపరేషన్ కోసం ప్రభుత్వం నుంచి రూ.2.50లక్షల ఎల్‌వోసీ చెక్కును నాయకుడు నవీన్‌గుప్తాతో కలసి బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కరుణాకర్‌రెడ్డి, గంగాధర్, గణేశ్, ప్రశాంత్, నగేశ్, నర్సింలు, యాదగిరి, వెంకటేశ్ ఉన్నారు.

### హనుమాన్ ఆలయ నిర్మాణానికి విరాళం

చిలిపిచెడ్, జూలై 11: గౌతాపూర్ గ్రామంలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి రూ.21 వేల విరాళాన్ని ఉమ్మడి కొడిపల్లి మండల వైస్ ఎంపీపీ సతీశ్ ఆలయ ఇన్‌చార్జి విఠల్‌కు గురువారం అందజేశారు.

### వన మహోత్సవంలో డీఈవో

కొల్చారం, జూలై 11: మండలంలోని ఏటిగడ్డ మాందాపూర్, వెంకటాపూర్ వన మహోత్సవం భాగంగా మండల ప్రత్యేక అధికారి రాధాకిషన్ గురువారం మొక్కలు నాటారు. ఆయనతో ఎంపీడీవో లక్ష్మీనర్సింహులు, ఎంఈవో నీలకంఠం, ఏపీవో మహిపాల్ రెడ్డి, పంచాయితీ కార్యదర్శులు సంధ్య, అంజుమున్నీసా బేగం, ఫీల్డ్ అసిస్టెంట్లు లక్ష్మి, దుర్గయ్య ఉన్నారు.

### క్రీడా ప్రాంగణం బోర్డు మాయం



కనిపించని క్రీడా ప్రాంగణం బోర్డు

చిలిపిచెడ్, జూలై 11: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో క్రీడా ప్రాంగణాలు నిర్మించారు. చిలిపిచెడ్ మండలంలోని గంగారం గ్రామంలో నిర్మించిన క్రీడా ప్రాంగణం పేరు బోర్డు మాయమై ఆరు నెలలు గడుస్తున్నా గ్రామ కార్యదర్శి, ఎంపీడీవో చూసీ చూడనట్లుగా వ్యవరిస్తున్నారు.

### ఘనంగా ఇంజినీర్స్ డే

మెదక్ మున్సిపాలిటీ, జూలై 11: తెలంగాణ ఇంజినీర్స్ డేను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని పంచాయితీరాజ్ కార్యాలయంలో సుప్రసిద్ధ నీటిపారుదల ఇంజినీర్ నవాబ్‌అలీ నవాజ్ జంగ్ బహదూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి గురువారం ఘనంగా నివాళులర్పించారు.

### మెరుగైన విద్యా బోధన చేయాలి

శివ్వంపేట, జులై 11: శిక్షణ పొందిన అంగన్‌వాడీ టీచర్లు మెరుగైన విద్యా బోధన చేయాలని ఐసీడీఎస్ నర్సాపూర్ ప్రాజెక్టు సీడీపీవో హేమభార్గవి అన్నారు. గురువారం శివ్వంపేటలో అంగన్‌వాడీలకు మూడు రోజుల శిక్షణ ముగిసింది. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WATER PROOFING**

★ Roof & Wall Crack Filling, Water Proofing Coatings, New & Old Bhathrooms Leakages, Water Tank & Sump Leakages, Rain Coat & Pest Control, Slab & Beems Injection Work, 10 years Waranty. Call: 9010425273, 8121425273.

NT-326124

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.